క్లుప్తంగా

పౌర హక్కుల పరిరక్షణకు సంఘం అవిరళ పోరాటం



లక్ష్మీపురం: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గత ఐదు దశాబ్దాలుగా పౌర హక్కుల సంఘం ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు కృషి చేస్తోందని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో శనివారం పౌర హక్కుల సంఘం ఆవిర్భవించి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా సమావేశం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం ఆవిర్భవించిన తొలినాళ్లల్లో రాజ్య హింసకు వ్యతిరేకంగా మాత్రమే పని చేసిందని తెలిపారు. అనంతరం సమాజంలోని ఆధిపత్య వ్యవస్థ మూలంగా అణచివేతకు గురవుతున్న ప్రజల హక్కుల కోసం పోరాటం ప్రారంభించిందని వివరించారు. న్యాయవాది ముప్పాళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం జాతీయ స్థాయిలో కృషి చేస్తున్న పౌరహక్కుల సంఘానికి పౌరులందరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో చంద్రయ్య, సదాశివరావు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



గుంటూరు మెడికల్: హెచ్‌ఐవీ బాధితులు క్రమం తప్పకుండా ఏఆర్టీ మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా జీవిత కాలాన్ని పొడిగించుకోవడంతో పాటు, ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లంకపల్లి మధుసూదనరావు సూచించారు. స్థానిక మంగళదాస్‌నగర్‌లోని హ్యాపెన్ కార్యాలయంలో హెచ్‌ఐవీ బాధితుల మధ్య జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని, ఆయన మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. హ్యాపెన్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ హెచ్‌ఐవీ చిన్నారులకు ప్రభుత్వ సహాయంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో కె.రవికుమార్, దుర్గ, జయరాజు పాల్గొన్నారు.

నేడు పిల్లల మానసిక వైద్యశాల ప్రారంభం



గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల పిల్లల్లో మానసిక సమస్యలు ప్రతి ఏడాది పెరిగిపోతున్నాయని ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ ఐ.శ్రీరమ్య తెలిపారు. స్థానిక ఓల్డ్ క్లబ్ రోడ్డులో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లలు, మహిళల మానసిక ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఆదివారం స్థానిక సాంబశివపేట 3వ లైనులో పాత్ వేస్ సైకాలజీ చికిత్సా కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మానస హాస్పిటల్ అధినేత, మానసిక వైద్య నిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఐ.వి.ఎల్.నరసింహారావు, రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ ఇవటూరి శరత్ చంద్ర మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా గుంటూరు నగరంలో మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. వృద్ధులకు ప్రతినెలా ఉచిత మానసిక వైద్య శిబిరం ఏర్పాటు చేసిన మందుల కూడా ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. పిల్లల్లో, యువతలో వస్తున్న వివిధ రకాల మానసిక రుగ్మతలు, ప్రవర్తన సమస్యల్ని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా వాటిని కట్టడి చేయవచ్చని తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ కొసరాజు కళాధర్, డాక్టర్ మంజులూరి భువనేశ్వరి ముఖ్య అతిథులుగా పాల్గొని హాస్పిటల్‌ను ప్రారంభిస్తారని వారు తెలిపారు.

క్రీస్తు నామంతో విజయం



గుంటూరు రూరల్: క్రీస్తు నామంలో విజయం కలుగుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలిపారు. మండలంలోని వెంగళాయపాలెంలో శనివారం హోలీ స్పిరిట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలతో పాటు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో నడిచి ప్రేమను, శాంతిని కలుగజేయాలని సూచించారు. ఆయన్ను నమ్మిన వారికి ఎల్లపుడూ తోడుగా ఉంటాడని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పాస్టర్స్‌కు వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు కలిమల పురుషోత్తం, కన్వీనర్ ఇస్రాయేలు సత్యప్రకాష్, కొలకలూరి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనం.. సకల పాప హరణం



లాలాపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో..



అరండల్‌పేట రంగనాయకస్వామి ఆలయంలో..



కొత్తపేట శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో భక్తులు



అరండల్‌పేట అష్టలక్ష్మీ మందిరంలో..





బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు, దర్శనానికి బారులు తీరిన భక్తులు



విద్యానగర్ సాయి సన్నిధానంలో పూజలు



సాకేత్‌పురం శ్రీరామాలయంలో ...



మల్లారెడ్డి నగర్ ఇస్కాన్ మందిరంలో పూజలు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా నగరంలోని వైష్ణవాలయాల్లో తెల్లవారుజాము నుంచే స్వామి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు బారులుతీరారు. అర్చకులు ఉత్సవమూర్తుల్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వారం నుంచి విష్ణుమూర్తి దివ్య రూపాన్ని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. – పాత గుంటూరు

పాలస్తీనాపై యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలి

నగరంపాలెం: పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ఏ. నరసింహారెడ్డి కోరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాషువా పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రాడీపేట సీపీఎం కార్యాలయ ఆవరణలో శనివారం పాలస్తీనాపై కవిత్వం 'నేల లేని దేశం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. సభకు కవి విల్సన్ అధ్యక్షత వహించి మాట్లాడగా, పుస్తకాన్ని విరసం సీనియర్ నేత సి.ఎస్.ఆర్. ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వనరుల దోపిడీ కోసమే ఇజ్రాయిల్ పాలస్తీనాపై యుద్ధం చేస్తోందని విమర్శించారు. ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదానికి గాజాలో పిల్లలు, వృద్ధులు, స్త్రీలు భారీసంఖ్యలో మృత్యువాతకు గురవుతున్నారని



పుస్తకావిష్కరణలో నరసింహారెడ్డి తదితరులు

పేర్కొన్నారు. సభలో వీసీకే పార్టీ మహిళా రాష్ట్ర నాయకురాలు కె.జయసుధ, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, ఆవాస్ రాష్ట్ర నేత ఎంఎ చిష్టి, రైతు కూలీ సంఘం నాయకులు ఎస్.బ్రహ్మయ్య, ముస్లిం సంక్షేమ సమితి నాయకులు అఫ్సర్ బాబు, బషీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధానత కల్పించాలి

నెహ్రూనగర్: విశ్వ బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని గుంటూరు పట్టణ సంఘ అధ్యక్షుడు కడియాల సుబ్బారావు కోరారు. అరండల్‌పేటలోని విశ్వ బ్రాహ్మణ కల్యాణ మండలంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణులు 20లక్షల పైగా ఉన్నప్పటికీ, చట్ట సభల్లో ఎటువంటి ప్రాధాన్యత కల్పించలేదని తెలిపారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించి, వారి అభ్యున్నతికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మేడిపి వెంకటప్రసాద్, చిరంజీవాచారి, చిలకపాటి బ్రహ్మయ్య, శివరామకృష్ణ, గురవాచారి పాల్గొన్నారు.



శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో..



కెనడీస్ నెక్స్ట్‌జెన్ కిడ్స్ స్కూల్‌లో...



వెంగళరావునగర్ గరల్స్ హైస్కూలులో ...



కేఎల్పీ స్కూలులో ...



శ్రీపూజిత స్కూలులో..



ఆక్స్‌ఫర్డ్ స్కూలులో...

హ్యాపీ క్రిస్మస్

పట్టణంలోని పలు పాఠశాలల్లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రీస్తు జననాన్ని, క్రిస్మస్ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలుచోట్ల శాంతాక్లాజ్, దైవదూతల వేషధారణలో చిన్నారులు క్రీస్తు జననం రూపకాన్ని ప్రదర్శించారు. – గుంటూరు ఎడ్యుకేషన్



విజ్ఞాన్ హైస్కూలులో..

చేతులారా అనారోగ్యాన్ని 'కొని' తెచ్చుకోవద్దు

- కేక్ కొంటున్నారా.. గమనించండి
- కాలపరిమితి చూసుకోవడం తప్పనిసరి
- మిఠాయిల్లో నాణ్యత లేకపోతే ప్రమాదం
- జీర్ణకోశవ్యాధుల బారిన పడే అవకాశం

గుంటూరు మెడికల్: పండుగ, పుట్టిన రోజు, పెళ్లి రోజు, వార్షికోత్సవం.. ఇలా సందర్భం ఏదైనా కేక్ కట్ చేయడం నేడు ఆనవాయితీగా మారింది. ప్రతి శుభ కార్యానికి స్వీట్ బాక్స్ తీసుకెళ్లడం గమనిస్తూనే ఉన్నాం. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో స్వీట్లు, కేక్‌లు తయారు చేసే షాపులున్నాయి. వీటిల్లో ప్రతిరోజూ లక్షలాది రూపాయిల్లో వ్యాపారం జరుగుతోంది. నగరం నుంచి దేశ విదేశాలకు స్వీట్లు కూడా ఎగుమతి చేస్తున్నారు. అయితే, కేక్‌లు, స్వీట్లు కొనుగోలు చేసే సమయంలో ఒకింత జాగ్రత్త వహించాలి. పదార్థాల్ని పరిశీలించి కొనుగోలు చేయాలి. లేని పక్షంలో ఆనందంగా తినే ఆహార పదార్థాలే మనకు అనారోగ్యాన్ని కలుగజేస్తాయి.

క్రిస్మస్ నుంచి సంక్రాంతి వరకు విస్తృత అమ్మకాలు

డిసెంబర్ ప్రారంభం నుంచి సెమీ క్రిస్మస్ వేడుకల జరుగుతూనే ఉంటాయి. ప్రతిరోజూ కేక్ కటింగ్‌లు జరుగుతాయి. డిసెంబర్ 25 క్రిస్మస్ రోజున, జనవరి 1 నూతన సంవత్సరం, సంక్రాంతి



రంగులతో చేసిన మిఠాయిలు

రోజున స్వీట్లు, కేక్‌ల అమ్మకాలు విరివిగా ఉంటాయి. ఏడాది మొత్తంలో జరిగే అమ్మకాల్లో వ్యాపారులకు వచ్చే లాభాల కంటే క్రిస్మస్, జనవరి ఫస్ట్ రోజున అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయమే అనేక రెట్లు ఎక్కువగా ఉంటుంది. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ రోజుల్లో కేక్‌లు కట్‌చేసి, స్వీట్లు పంచుకుని సంబరాలు నిర్వహించుకుంటారు. రోడ్లపైన బల్లలు పెట్టి, పందిళ్లు వేసి ఒక్కరోజులోనే లక్షలాది రూపాయల వ్యాపారం నిర్వహిస్తున్నారు. అయితే, వ్యాపారుల్లో పలువురు లాభార్జనే ధ్యేయంగా వినియోగదారుల ఆరోగ్యం గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నిషేధించిన రంగుల్ని వినియోగించి అమ్మకాలు చేస్తున్నారు.



రంగులతో చేసిన కేక్‌లు

నిబంధనలకు తిలోదకాలు

జిల్లాలో బేకరీ షాపులు, స్వీట్ల షాపుల నిర్వాహకులు ఎక్కువ మంది ఫుడ్ లైసెన్స్‌లు తీసుకోకుండా అమ్మకాలు చేస్తున్నారు. బ్రెడ్ తయారు చేసే బేకరీలలో చాలా చోట్ల తయారు చేసిన తేదీ, కాలపరిమితి తేదీని కవరుపై ముద్రించకుండానే అమ్మకాలు చేస్తున్నారు. సీట్లు బాక్సులపై కూడా తప్పనిసరిగా తయారీ తేదీ, వాటిని ఎప్పటిలోగా వినియోగించాలో తెలియజేస్తూ తేదీలు ముద్రించాలి. కాలపరిమితి తెలియజేయకుండా స్వీట్లు, కేక్‌లు విక్రయాలు చేయడం చట్టరీత్యా నేరం. కొనుగోలు చేసే సమయంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా చూడాలి. అనుమతిలేని రంగుల్ని కేక్‌లపై పేర్లు రాసేందుకు, స్వీట్లు ఆకర్షణీయంగా ఉండేందుకు వాడుతున్నారని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తెలిపారు.

వ్యాధులొస్తాయి



నిషేధించిన రంగులతో తయారు చేసిన కేక్‌లు, స్వీట్లు తినడం వల్ల అనేక రోగాలు వస్తాయి. వాటిని తినడం వల్ల పలు రకాల క్యాన్సర్‌లు వస్తాయి. ఊపిరితిత్తులు, జీర్ణకోశవ్యాధుల సమస్యలు వస్తాయి. ఫుడ్ పాయిజన్ జరిగి వాంతులు, విరోచనాలు అయ్యి ప్రాణాలు పోయే అవకాశాలు ఉన్నాయి.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా,
జీర్ణకోశవ్యాధినిపుణులు, గుంటూరు

రూ. 5లక్షల వరకు జరిమానా



అనుమతి లేకుండా కేక్‌లు, స్వీట్లు రోడ్డుపై అమ్మే వారిపై దాడులు చేస్తాం. విక్రయించే ఆహార పదార్థాల్ని సీజ్ చేసి, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ఆహార పదార్థాలు తయారుచేసే సంస్థలు, హోల్‌సేల్‌గా, రిటైల్‌గా అమ్మేవారంతా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయం నుంచి లైసెన్స్ తీసుకోవాలి. లేనిపక్షంలో ఐదులక్షల రూపాయల జరిమానా, ఆరునెలల జైలు శిక్ష ఉంటుంది. వినియోగదారులు నాణ్యత విషయంలో ఏమైనా అనుమానాలుంటే 9440379755 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి.

–నూతలపాటి పూర్ణచంద్రరావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, గుంటూరు

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

పట్నంబజారు: ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గంలోని మూడో డివిజన్ బాలాజీనగర్‌లో కార్పొరేటర్ పోలవరపు జ్యోతి ఆధ్వర్యంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముస్తఫా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఏసు చూపిన శాంతి, ప్రేమ మార్గాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు వెంకటేశ్వరరావు, చంటి పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా

అద్భుతమైన ఆటల వేదిక 'ఆడుదాం ఆంధ్రా'

పట్నంబజారు: విద్యార్థులు, యువతలో నైపుణ్యాల్ని వెలికితీసే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' వంటి గొప్ప కార్యక్రమాన్ని తీసుకు వచ్చారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని ధృఢంగా, ఆరోగ్యంగా జీవించేందుకు 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 26వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

సీఎం జగన్‌కు తిరిగి పట్టం కట్టాలి

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. సంక్షేమ సారథిగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మరోమారు పట్టం



సమావేశంలో మాట్లాడుతున్న నూరిఫాతిమా

కట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని 54వ డివిజన్ సంజీవయ్యనగర్, 17వ డివిజన్ ఐపీడీ కాలనీల్లో శనివారం ' మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మల్లవరపు రమ్య, ఫర్హాన, వైఎస్సార్ సీపీ నేతలు అగ్గిపెట్టి రాజు, ఎం. సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, రవిరాజ్, దాస్, నరసమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రాంతీయ క్రీడా పోటీల్లో హిందూ ఇంజినీరింగ్ కళాశాల డిప్లొమా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్. సుబ్బారావు తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నల్లపాడులోని ఎంబీటీఎస్, గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లలో జరిగిన క్రీడా పోటీల్లో తమ విద్యార్థులు బహుమతులు గెలుపొందినట్లు తెలిపారు. 400 మీటర్ల రిలేలో చైతన్య, సుమంత్, రాకేష్, శ్రీనివాస్ జిల్లాస్థాయిలో మొదటి స్థానం, బాలికల విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో వైష్ణవి మనోజ్ఞ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. వీరంతా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, పోటీల సమన్వయకర్త సందీప్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ క్రోసూరి రవి అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న సుబ్బారావు, నర్సిరెడ్డి

ఖురాన్ కంఠస్థ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధ్యాత్మిక విద్య చిన్నతనం నుంచే అలవర్చుకోవడం ద్వారా సమాజంలో ఉత్తములుగా రాణించవచ్చునని జైన్ హైస్కూల్ డైరెక్టర్ మొహ్మద్ మున్ను అన్నారు. సంగడిగుంటలోని జైన్ హైస్కూల్లో శనివారం యునైటెడ్ ఫోరం ఫర్ ఖురాన్ స్టడీస్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎండీ మున్ను మాట్లాడుతూ పవిత్ర ఖురాన్ గ్రంథంలోని అంశాలను ఆచరణలోకి తీసుకోవడం ద్వారా ఇహలోక, పరలోకాల్లో సైతం విజయవంతం కావచ్చని చెప్పారు. ఆధ్యాత్మికతను ప్రతి ఒక్కరూ కలిగి ఉండడం వల్ల శాంతి సౌభ్రాతృత్వం దయ, కరుణ వంటి విషయాలు చిన్నతనం అలవడతాయని తెలిపారు. యునైటెడ్ ఫోరం ఫర్ ఖురాన్ స్టడీస్ సెమీఫైనల్, ఫైనల్ పోటీల్ని సైతం నిర్వహిస్తూ సమాజంలో మంచిని పెంపొందించే విధంగా కార్యక్రమాలు రూపొందించడంపై అభినందనలు తెలిపారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు క్వార్టర్ ఫైనల్, సెమీ ఫైనల్‌తో పాటు ఫైనల్స్‌కు వెళతారని పేర్కొన్నారు. విజేతలకు ప్రముఖులతో నగదు బహుమతి అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో యునైటెడ్ ఫోరం ఫర్ ఖురాన్ స్టడీస్ జిల్లా అధ్యక్షుడు జహీర్, సభ్యులు హిదాయతుల్లా బేగ్, అలీమ్, ముస్లిం ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎండీ మున్ను, సభ్యులు

హృద్రోగ బాధితులకు అండగా 'బజరంగ్'



యాంజియోగ్రామ్ పరీక్షల కోసం వచ్చిన ఉప్పలపాడు గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

యాంజియోగ్రామ్ పరీక్షల కోసం ప్రత్యేక బస్సులో ఆసుపత్రికి తరలింపు

పెదకాకాని: హృద్రోగ వైద్య పరీక్షలు అవసరమైన వారికి బజరంగ్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అండగా నిలిచారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా ఈనెల 21న ఉప్పలపాడులో ఏర్పాటు చేసిన 'బజరంగ్ సంక్షేమ సంగమం' కార్యక్రమం ద్వారా 'మీ గుండె పదిలం' శిబిరంలో యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమైన 35 మందిని గుర్తించారు. వారందరినీ చికిత్స నిమిత్తం శనివారం ప్రత్యేక బస్సులో విజయవాడ మెడ్ స్టార్ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా యాంజియోగ్రామ్‌కు హాజరైన పేషెంట్లను అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్ద వయస్సులో ఉన్న వారు ఏటా క్రమం తప్పకుండా ఒకసారి గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా 'మీ గుండె పదిలం' నినాదంతో చేపట్టిన వైద్య శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. గుండె సమస్య ఉన్న వారు అది తీవ్రతరం కాకమునుపే ఈ శిబిరం ద్వారా వైద్య సహాయం పొందడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. బాధితులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తూ, వేగవంతంగా సకాలంలో వైద్య సహాయం అందేందుకు తోడ్పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని మరిన్ని గ్రామాలకు తీసుకువెళతానని ఆయన స్పష్టం చేశారు. బజరంగ్ బృందం ఉప్పలపాడు గ్రామం నుంచి ప్రత్యేక బస్సు ద్వారా పేషెంట్లను ఆసుపత్రికి చేర్చడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

'ఆడుదాం ఆంధ్రా'తో యువతకు భవిత

గుంటూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్ని ప్రోత్సహించి వారికి ఉజ్వల భవిష్యత్తును కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టారని రూరల్ ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయాల పరిధిలో శనివారం ఆడుదాం ఆంధ్రా ర్యాలీని నిర్వహించారు.